ప్రజాశక్తి

ఆదివారం 6 అక్టోబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఉక్కుపై కూటమి చొరవ చేసేనా..

◆ స్టీల్‌ప్లాంట్‌ను బలహీనపరిచే కుట్రలను అడ్డుకునేనా.. ◆ ఎంత కాలం బిక్కుబిక్కుమంటూ జీవనం

◆ సర్వత్రా కార్మికుల్లో చర్చ ◆ ఉద్ధృతం దిశగా ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటం ◆ నేడు భారీ మానవహారం



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ విషయంలో రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ఎలా వ్యవహరించనుందన్న చర్చ నేడు సర్వత్రా సాగుతోంది. కర్మాగారాన్ని బలహీన పరిచే మోడీ ప్రభుత్వ కుట్రలను అడ్డుకోవాలని కార్మికవర్గం కోరుతోంది. వాస్తవానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు 2021లో నిర్ణయం తీసుకున్న దగ్గర నుంచీ కార్మిక, ప్రజా పోరాటాలు కొనసాగుతూనే ఉన్నాయి. టిడిపి కూటమి ప్రభుత్వం 2024 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చాక ప్రైవేటీకరణ బంతి వీరి కోర్టులోకి వచ్చి పడింది. అప్పటికే ప్రధాని నరేంద్ర మోడీ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయడం లేదా ప్రైవేటీకరించడం మా విధానం అంటూ రాజకీయ నిర్ణయం చేసిన సంగతి తెలిసిందే. దీన్ని ఆపాలంటే కార్మికుల పోరాటానికి రాజకీయ పార్టీల అండా ఎంతో అవసరం. ఇప్పటికే ప్లాంట్ రక్షణకు సిపిఎం, వామపక్షాలు పోరాడుతున్నాయి. నేడు ఉక్కు పోరాటానికి ప్రధానంగా టిడిపి, జనసేన జోడు గుర్రాలుగా నిలవాల్సి ఉంది. అయితే ఈ పార్టీలు చొరవ చేసి కేంద్ర నిర్ణయాన్ని నిలువరిస్తాయా ? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నికల ముందు వరకూ ప్లాంట్‌ను కాపాడుతామన్న కూటమి నాయకులు ఎన్నికలయ్యాక మాటలతోనే సరి పెడుతున్నారు. మరోపక్క ఉక్కు కార్మికులు మాత్రం పట్టు విడవక 1331 రోజులుగా ఉద్యమిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలోనే ఆదివారం 8 గంటల నుంచి 10 గంటల వరకూ భారీ మానవ హారానికి గాజువాక నియోజకవర్గంలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి కుటుంబాలతో సహా అందరూ హాజరయ్యే అవకాశముంది. ఇంకెంత కాలం తాము బిక్కుబిక్కుమంటూ జీవించాలంటూ ఇప్పటికే ఉక్కు కార్మికుల్లో ఆగ్రహ జ్వాలలు రగుల్కొంటున్నాయి. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు భూములిచ్చిన నిర్వాసితులు ప్రైవేటీకరణ పట్ల తీవ్ర కలత చెందుతున్నారు. ఇటీవల నాలుగు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించాలని స్టీల్ యాజమాన్యం చూసింది. దీంట్లో వీరే అత్యధికం. ఇదిలా ఉండగా మరో 2500 మంది పర్మినెంట్ ఉద్యోగులపై విఆర్ఎస్ అస్త్రం ప్రయోగించాలని ఉక్కు యాజమాన్యం చూస్తోంది. ప్రభుత్వ గనుల విధానం 2013 ప్రకారం ప్రభుత్వ రంగ సంస్థలకు గనులు కేటాయించాలన్న నిబంధన ఉన్నా కేంద్ర బిజెపి ఉల్లంఘిస్తూ వస్తోంది. ఆ పార్టీతో జత కట్టి రాష్ట్రంలో గెలిచిన టిడిపి, జనసేనలు చొరవ చేసి బిజెపిని ఆపకపోతే తీవ్రస్థాయిలో కార్మికాగ్రహాన్ని చవిచూడక తప్పదన్న వాతావరణం అంతటా నెలకొంది. కనీసం సెయిల్‌లో స్టీల్‌ను విలీనం చేసే ప్రక్రియను కూడా కేంద్రం చేపట్టడం లేదు. ఇంకోపక్క ఉక్కు మిగతా 2లో..



గిరిజనులతో కలిసి నినదిస్తున్న లోకనాథం

'ఉరక గెడ్డ' కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు జరపాలి

◆ బాధితులకు ఆర్ఆర్ ప్యాకేజీని వెంటనే అమలు చేయాలి

◆ సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి - మాడుగుల : ఉరక గెడ్డ రిజర్వాయర్ నిర్వాసితుల పరిహార కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు జరపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని శంకరం పంచాయతీ ఉరకగెడ్డ రిజర్వాయర్ ప్రాంతాన్ని ఆయనతో పాటు పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, మండల కార్యదర్శి ఇరట నరసింహమూర్తిలతో కూడిన బృందం పరిశీలించింది. ప్రాజెక్టు పునరావాస బాధిత గ్రామాలైన బొడ్డ రేవు, చిన బొడ్డరేవు గిరిజనులుతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకుంది. అనంతరం లోకనాథం మాట్లాడుతూ బాధితులకు ఆర్ఆర్ ప్యాకేజీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వాయర్ నిర్మాణం జరిగినప్పుడు బొడ్డరేవు, చినబొడ్డరేవు గిరిజన గ్రామాలకు చెందిన 56 గిరిజన కుటుంబాల వారికి.. ప్రాజెక్టులో మునిగిపోయిన వారికి ఆర్ఆర్ ప్యాకేజీ అమలు కోసం ప్రభుత్వం 2005 ఏప్రిల్ 8న జిఒ నెంబరు 68ని విడుదల చేసిందన్నారు. ఆ ప్రకారం పునరావాస బాధిత కుటుంబాలకు సంబంధించి ఒక్కో ఇంటి స్థలం చొప్పున ఇవ్వడంతో పాటు 56 కుటుంబాలకూ అన్ని రాయితీలూ కలుపుకొని ఆర్ఆర్ ప్యాకేజీ ప్రకారం రూ.5 కోట్లు పైబడి ఇవ్వవలసి ఉందన్నారు. కానీ కేవలం మిగతా 2లో..

సిపిఎం విశాఖ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

▶ వార్త 8లో..

బాబు గారూ.. పండగ పూటా పస్తులేనా?

▶ వార్త 5లో..

విశాఖ ఆర్‌డిఒగా శ్రీలేఖ బాధ్యతల స్వీకరణ

▶ వార్త 2లో..

నేడు లెనిన్ శత వర్ధంతి సభ

జెఎన్‌యు ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కమ్యూనిస్టు మేధావి లెనిన్ శత వర్ధంతి సభ ఆదివారం ఉదయం 10 గంటలకు నగరంలోని డాబాగార్డెన్స్‌లోగల అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో లెనిన్ శత వర్ధంతి నిర్వహణ కమిటీ ఆధ్వర్యాన జరుగుతుంది. ఈ సభలో 'లెనిన్ విప్లవ జీవితం-సోషలిస్టు విప్లవం-నేటి సామ్రాజ్య వాదం' అన్న అంశంపై కీలకోపన్యాసం చేసేందుకు జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ (ఢిల్లీ) ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. అనంతరం 'ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి-లెనినిస్ట్ దృక్పథం-ప్రత్యామ్నాయ విధానాలు' అన్న అంశంపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మిగతా 2లో..

8 నుంచి మలబార్ విన్యాసాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మారిటైమ్ మలబార్ 2024 సముద్ర విన్యాసాలకు విశాఖ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ క్రమంలో ఈ నెల 8 నుండి 18 వరకు మొదట హార్బర్ ఫేజ్, తర్వాత సి ఫేజ్‌లలో విన్యాసాలు జరుగుతాయి. ఆస్ట్రేలియా, జపాన్, అమెరికా నావికా దళాలు పాల్గొంటాయని అధికారులు చెబుతున్నారు. ఈ మలబార్ విన్యాసాలు హిందూ మహాసముద్రం, ఇండో - పసిఫిక్ ప్రాంతంలో పరస్పర సహకారాన్ని పెంపొందించడం కోసం 1992లో ప్రారంభమైనట్టు గుర్తుచేస్తున్నారు.

ఘనంగా అక్కినేని శత జయంతి ముగింపు వేడుకలు

నటుడు మురళీ మోహన్‌కు నాగేశ్వరరావు స్మారక పురస్కారం అందజేత



మురళీ మోహన్‌కు నాగేశ్వరరావు స్మారక పురస్కారం అందజేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : లెజెండరీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ముగింపు వేడుకలు విశాఖ నగరంలోని కళాభారతి వేదికగా శనివారం ఉత్సాహపూరిత వాతావరణంలో సాగాయి. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రముఖ నటుడు ఎం.మురళీ మోహన్‌కు అక్కినేని స్మారక పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ తెలుగు సినీ పరిశ్రమకు అక్కినేని ఆణిముత్యం వంటివారన్నారు. పురస్కార గ్రహీత మురళీ మోహన్‌తో కలిసి ఉంటే కష్టాలు మరిచిపోతామని, పార్లమెంటులో ఆయన ఎంపీగా ఉన్నప్పుడు చోటుచేసుకున్న స్మృతులను గుర్తుచేసుకున్నారు.

అన్ని రకాల పాత్రల్లో మెప్పించిన గొప్ప నటుడు మురళీ మోహన్ అని కొనియాడారు. సినీ పరిశ్రమలో విభేదాలు ఉంటే సినీ పెద్దగా ఆయన వాటిని పరిష్కరించేవారన్నారు. మురళీమోహన్‌ను ఆదర్శంగా తీసుకొని రాజకీయ నాయకులు పనిచేయాలని అన్నారు. విశిష్ట అతిథి, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ వందేళ్ల జీవితంలో 80 ఏళ్ల పాటు చలనచిత్ర రంగంలోనే అక్కినేని జీవించారన్నారు. నేటికీ విలువలతో కూడిన నటన కొనసాగిస్తూ.. చలనచిత్ర రంగానికి గౌరవం తీసుకువస్తూ 350 చిత్రాల్లో నటించిన మురళీమోహన్‌కు పురస్కారం అందించడం సముచితం అన్నారు. కార్యక్రమానికి ముందు న్యూ రోషన్ లాల్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో సంగీత విభావరి నిర్వహించారు. మద్దాళి రఘురాం వ్యాఖ్యాతగా వ్యవహరించగా, ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, వివి.రమణమూర్తి, ఎంవిఆర్.కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు మాజీ రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు అధ్యక్షత వహించారు. మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఉక్కుపై కూటమి చొరవ చేసేనా..

ఉద్యోగులపై విపరీతమైన ఆర్థిక ఆంక్షలను యాజమాన్యం విధిస్తోంది.

గాజువాక అభివృద్ధిలో కీలక పాత్ర

గాజువాక అభివృద్ధిలో కీలకపాత్ర పోషించడంలోనూ, తలసరి ఆదాయం అత్యధికంగా ఉన్న ప్రాంతంగా గాజువాకను నిలపడంలోనూ స్టీల్‌ప్లాంట్‌దే కీలకపాత్ర. ప్లాంట్‌ను కార్మికులు సుదీర్ఘకాలం ప్రగతిపథాన నడిపారు. మోడీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత ప్లాంట్‌కు గడ్డుకాలం మొదలైంది. కేంద్రం ప్రైవేటీకరణ జరగదంటూనే ప్లాంట్‌లోని రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లను మూసెయ్యడం, కాంట్రాక్టు కార్మికులను తొలగించే ప్రక్రియకు పూనుకోవడం వంటి చర్యలతో బలహీనపరిచే కుట్రలను వేగవంతం చేస్తోంది. కూటమిలో ప్రధాన భాగస్వామ్య పక్షాలైన తెలుగుదేశం, జనసేనలు మేం మాట్లాడుతున్నాం.. ఆపుతున్నాం అంటూ చెప్పుకుంటూ వస్తున్నా కేంద్రం నుంచి ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే ప్రకటన రావడం లేదు. ఇదే కొనసాగితే భవిష్యత్తులో ఈ ప్రాంత ప్రజలు, కార్మికుల ఆగ్రహాన్ని కూటమి పార్టీలు చవిచూడక తప్పదని పలువురు హెచ్చరిస్తున్నారు.

'ఉరక గెడ్డ' కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు జరపాలి

ఇంటి స్థలం.. ఇందిరమ్మ స్కీమ్ ఇల్లు మంజూరు చేసి చేతులు దులుపుకొని గిరిజన పునరావాస బాధితులకు నష్టపరిహారం ఇవ్వకుండా మోసం చేశారన్నారు. అధికారులు భారీ కుంభకోణానికి పాల్పడినట్టు అర్థమవుతోందన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి పునరావాస బాధితులకు వెంటనే పరిహారం చెల్లించాలన్నారు. బాధితులకు న్యాయం కోసం దశలవారీగా ఆందోళనలు చేపడతామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే గిరిజనుల తరుపున న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసుకుని ఎత్తిపోతల పథకం ద్వారా వేలాది ఎకరాలకు సాగునీటిని ఉపయోగించుకుంటూ అమాయక గిరిజనులను మోసం చేయడం దారుణమన్నారు. సమస్యను పరిష్కరించకుంటే ప్రభుత్వం, అధికారులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు కె.భవాని, దేవరాపల్లి మండల కార్యదర్శి బిటి.దొర, పునరావాస బాధితులు పాల్గొన్నారు.

నేడు లెనిన్ శత వర్ధంతి సభ

పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం ప్రసంగించనున్నారు. లెనిన్ శతవర్ధంతి సభా కార్యక్రమం కొనసాగింపుగా మధ్యాహ్నం 'లెనినిజం –వర్తమానం– కర్తవ్యం' అన్న అంశంపై ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ ప్రసంగించనున్నారు. సభాధ్యక్షులుగా సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు వ్యవహరించనున్నారు.



సెంటర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ సుజాత, పాల్గొన్న హెచ్‌ఎస్‌ఎల్ అధికారులు

ఒహెచ్‌సిని అప్‌గ్రేడ్ చేసిన హెచ్‌ఎస్‌ఎల్

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ తమ కాంట్రాక్ట్ కార్మికులతో సహా ఉద్యోగుల శ్రేయస్సు కోసం ఆక్యుపేషనల్ హెల్త్ సెంటర్ (ఒహెచ్‌సి)ని శనివారం అప్‌గ్రేడ్ చేసి అందుబాటులోకి తీసుకొచ్చింది. అత్యాధునిక వైద్య పరికరాలు, అధునాతన ఫర్నిచర్‌ను ఏర్పాటు చేసి అందరికీ ఇక్కడ మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఏర్పాట్లు చేసింది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఇండస్ హాస్పిటల్ సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వి.సుజాత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సంరక్షణ్ (హెచ్‌ఎస్‌ఎల్ లేడీస్ క్లబ్) అధ్యక్షురాలు వందనా ఖత్రి, హెచ్‌ఎస్‌ఎల్ సిఎమ్‌డి ఖత్రి, మేనేజ్‌మెంట్ సభ్యులు, గుర్తింపు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

అధిక ధరలను అదుపు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : అధిక ధరలను ప్రభుత్వాలు అదుపు చేయాలని సిపిఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ధరలు తగ్గిస్తామన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పుడు వ్యాపారస్తులకు లాభాలు చేకూర్చే విధంగా ప్రజల మీద భారాలు వేస్తున్నాయని మండిపడ్డారు. సిపిఎం 18వ వార్డు అంజయ్యనగర్ శాఖ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచి ప్రభుత్వాలు పెంచిన నిత్యావసర ధరలను వ్యతిరేకించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బిజెపి ప్రభుత్వం దిగుమతి సుంకం 20 శాతం పెంచడం వల్ల వంట నూనె ధర లీటరుకు 40 రూపాయలు పెరిగిందన్నారు. బియ్యం కిలో 70 రూపాయలకు దాటిందని, కందిపప్పు, మినపపప్పు, చింతపండు, పోపు దినుసులు, ఉల్లిపాయలు, టమాటా ఇతర కూరగాయల ధరలన్నీ భారీగా పెరిగి పేదలు మోయలేని భారంగా ఉన్నాయన్నారు. తక్షణమే అధిక ధరలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ శాఖా సభ్యులు ఎం.చంటి, ఎన్‌వి.రమణ, రాజేష్, సంతోష్, గీత, జోన్ నాయకులు కుమారి పాల్గొన్నారు.

ప్రజల వృద్ధిలేని విజన్‌కు విలువుండదు..!

ప్రజాశక్తి – అనకాపల్లి ప్రతినిధి

కాలగర్భంలో కలిసిన విజన్ 2020కి మరో రూపమే స్వర్ణాంధ్ర 2047. చంద్రబాబు ప్రభుత్వ కాలంలోని ఈ విజన్లకు అభివృద్ధి దార్శనికత కంటే ప్రచారార్భాటమే ఎక్కువ. విజన్ ప్రణాళికలో వెనుకబడిన ప్రాంత అభివృద్ధి, ప్రజల ఆకాంక్షలు, అభిరుచులకు చోటు వుండదు. తను లేదా తమ ప్రభుత్వం ఏదో చేయబోతున్నట్లు నమ్మించడమే విజన్ల అంతిమ లక్ష్యం. ఇందులో ప్రజల భాగస్వామ్యం నామమాత్రమే. విజన్ ప్రణాళిక తయారీకి జిల్లాలో జరిగిన సమావేశ సారం చూస్తే దాని అవిటితనం కనబడుతుంది. అభివృద్ధికి ఎంచుకున్న ప్రమాణాలు, అవి సాధనకు అనుసరించే నమూనాలను పరిశీలిస్తే, ప్రగతి పథాన జిల్లాను నడిపించడానికి మార్గాన్వేషణ చేస్తున్నట్లు లేదు. ఇంకోవైపు తమ ప్రాంత వెనుకబాటుతనం, అభివృద్ధికి వున్న అవకాశాలు, వనరులను వివరించి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి, స్థిరమైన వృద్ధిని సాధించుకొనే శక్తివంతమైన పాత్ర నిర్వహించలేని అచేతనులుగా ఇక్కడి ప్రజా ప్రతినిధులున్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకంపై మోడీ ప్రభుత్వ విన్యాసాలను ఎంపీలు, ఎమ్మెల్యేలు సర్కస్ చూసినట్లు చూస్తున్నారు తప్పితే ఆ ప్రభుత్వ దాడిని అడ్డుకొనే గట్టి ప్రయత్నం చేయడంలేదు. పదవుల కోసం ఆత్మాభిమానం చంపుకొని, రాజకీయాలు చేస్తూ, చోద్యం చూస్తున్నారేగానీ విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని నిలదీసి అడగలేకపోతున్నారు. వాస్తవ సామర్థ్యానికి తగినట్లు ప్లాంట్ నడిచేలా ముడిసరుకు సరఫరాకు కల్పిస్తున్న ఆటంకాలు



తొలగేలా మాట్లాడలేకపోతున్నారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా నిరవధికంగా సాగుతున్న ఉద్యోగుల పోరాటంలో సిపిఎం, వామపక్షాలు భాగమైనడుస్తున్నా, ప్రధాన రాజకీయ పార్టీలు మనస్ఫూర్తిగా భాగస్వామికాలేకపోవడం బాధాకరం.

వ్యవసాయాధారిత గ్రామీణ ప్రాంతంలో పంటలకు సాగునీటి వసతి కల్పించడానికి పోలవరం ఎడమ కాలువ, సుజల స్రవంతి పనులు జరిగేలా ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక విజన్ వుండాలి. మూతపడ్డ మూడు సుగర్ ఫ్యాక్టరీలను ఆధునికీకరించి పునరుద్ధరించాలని, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ సామర్థ్యం పెంచి మద్దతు ధర ఇవ్వాలన్న రైతు ఆకాంక్షలను గౌరవించగలిగిన ప్రణాళిక తయారుచేసి ప్రభుత్వం ముందుంచాలి. అనకాపల్లి జిల్లాలోని నాన్‌షెడ్యూల్ గిరిజన ప్రాంతాలను ఐదో షెడ్యూల్ జాబితాలో చేర్చి, షెడ్యూల్ ప్రాంతంలోవలె అన్ని పథకాలూ, చట్టాలు వర్తింపజేసి, ఈ ప్రాంత అభివృద్ధికి పట్టుబట్టాలి.

తీర ప్రాంత మండలాల్లో పరిశ్రమల కాలుష్యాన్ని నియంత్రించి, ప్రజల ఆరోగ్యాన్ని, మత్స్యకారుల జీవనోపాధిని కాపాడే క్రియాశీలక పాత్ర పోషించాలి. పరిశ్రమల్లో నిర్వాసిత కుటుంబాలు, స్థానిక యువత ఉపాధి కల్పనకు చిత్తశుద్ధితో పనిచేయాలి. గతంతో ముడిపడిన వర్తమానంలో మళ్లీమళ్లీ పొరపాట్లు చేసి అభివృద్ధిని విస్మరించకుండా భవిష్యత్ పురోగమనానికి విజన్ ప్రణాళికలో ప్రజలకు స్థానం కల్పించేలా ప్రజాప్రతినిధులు చొరవచూపినప్పుడే కొద్దిగానైనా విజన్‌కు విలువ వుంటుంది.

న్యూ టిన్సుకియా - ఎస్ఎంవిటి బెంగళూరు మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : పండగ సీజన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం న్యూ టిన్సుకియా – ఎస్ఎంవిటి బెంగళూరు మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో 05952 న్యూ టిన్సుకియా – ఎస్ఎంవిటి బెంగళూరు ప్రత్యేక రైలు నవంబర్ 7 నుంచి డిసెంబర్ 26 వరకు ప్రతి గురువారం సాయంత్రం 18.45 గంటలకు న్యూ టిన్సుకియా నుంచి బయలుదేరి మూడో రోజు (శనివారం) 15:20 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 15:25 గంటలకు బయలుదేరి ఆదివారం ఉదయం 9:00 గంటలకు ఎస్ఎంవిటి బెంగళూరు చేరుకుంటుంది. 05951 ఎస్ఎంవిటి బెంగళూరు –న్యూ టిన్సుకియా ప్రత్యేక రైలు నవంబర్ 11 నుంచి డిసెంబర్ 30 వరకు ప్రతి సోమవారం 00.30 గంటలకు ఎస్ఎంవిటి బెంగళూరు నుండి బయలుదేరి అదేరోజు రాత్రి 21:15 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 21:20 గంటలకు బయలుదేరి బుధవారం 13:15 గంటలకు న్యూ టిన్సుకియా చేరుకుంటుంది. ఈ రైళ్లు ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోని దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్ మీదుగా ప్రయాణిస్తాయి.

విశాఖ ఆర్‌డిఒగా శ్రీలేఖ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం ఆర్‌డిఒగా పి.శ్రీలేఖ శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్‌ను ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మహిళల ప్రాణాలకు భరోసా ఏదీ ?

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో మహిళల ప్రాణాలకు భరోసా లేకుండా పోయిందని వైసిపి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. పుంగనూరులో గత ఆదివారం అదృశ్యమైన బాలిక అసిఫియా అంజుమ్ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో శవమై తేలేదాకా పోలీసులు కనిపెట్టలేకపోయారని తెలిపారు. శనివారం ఉదయం సిరిపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరిస్తున్న కేంద్రానికి...

టిడిపి, జనసేన మద్దతు ఉపసంహరించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను మొండిగా కొనసాగిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరిస్తున్నట్లుగా ఢిల్లీ పర్యటన మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన ప్రకటించాలని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వివి.రమణమూర్తి విజ్ఞప్తి చేశారు. పౌర గ్రంథాలయంలో ప్రజా సంఘాల నాయకులతో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను భేషరతుగా విరమించి, ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, సొంత గనులు కేటాయించాలని, స్టీల్‌ప్లాంట్‌కు రూ.10 వేల కోట్లు వర్కింగ్ కేపిటల్‌గా ఇవ్వాలని కోరుతూ ఈ నెల 2వ తేదీన ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ నిర్వహించిన సభలో ప్రతిపాదించిన తీర్మానాలను ఆమోదించినట్లు చెప్పారు. స్టీల్‌ప్లాంట్‌ను కారు చౌకగా కార్పోరేట్ శక్తులకు కట్టబెట్టడానికి మోడీ ప్రభుత్వం సన్నాహాలను వేగవంతం చేస్తుందన్నారు. దీనికి వ్యతిరేకంగా కేంద్రాన్ని నిలువరించేందుకు కూటమి ప్రభుత్వం ఉత్తరాంధ్ర ప్రజల మనోభీష్టానికి అనుగుణంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. తాము రాష్ట్రంలో అధికారంలోకి వస్తే స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను నిలుపుదల చేస్తామని, ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ప్రకటించిన మేరకు కట్టుబడి కూటమి పార్టీలు నిర్ణయాలు చేయాలని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ డిమాండ్ చేస్తోందన్నారు. జనవరి 27న లక్ష మందితో భారీ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.



మీడియాతో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌ను కాపాడతామని చెప్పి నేడు టిడిపి, జనసేన నాయకులు మౌనం పాటిస్తున్నారన్నారని మండి పడ్డారు. స్టీల్ ప్లాంట్ యువ కార్మికుల అచ్చిబాబు మాట్లాడుతూ, గత జగన్ ప్రభుత్వం ప్రైవేటీకరణకు అనుకూలంగా వ్యవహరించిందని, కాపాడుతామని చెప్పిన కూటమి ప్రభుత్వం బిజెపి చేతిలో కీలుబొమ్మగా మారిందని విమర్శించారు. సమావేశంలో పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, జిల్లా అధ్యక్షులు వెంకటలక్ష్మి, విశాఖ సిటిజన్ ఫోరం ప్రెసిడెంట్ పిఎన్.తిలక్, న్యాయవాదులు కెఎస్.చలం, సూర్యప్రకాష్, భారత నాస్తిక సమాజం నాయకులు జె.రవి, విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు రామచంద్ర కిషోర్, మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం నగర కన్వీనర్ ఈసరు లక్ష్మి, భీమసేన వార్ ప్రతినిధి కె.చిన్నారావు, కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు డెంకాడ ఆనంద్, స్టీల్‌ప్లాంట్ యువ కార్మిక సంఘం నాయకులు వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కోలాటం పోటీలు

ప్రజాశక్తి-ఆనందపురం : గంటా నారాయణమ్మ ట్రస్ట్ ఆధ్వర్యాన కోలాటం పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ డాక్టర్ వి.జానకి తెలిపారు. గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సహకారంతో గంటా నారాయణమ్మ ట్రస్టు ఆధ్వర్యాన దసరా సందర్భంగా కోలాటం పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో జరిగే మండల స్థాయి పోటీలకు ఎంపిడిఒ, తహశీల్దార్లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఒక్కో మండలానికి ఒక సీనియర్, ఒక జూనియర్ బృందాన్ని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. మండల స్థాయిలో 7, 8 తేదీలలో పోటీలు ఉంటాయని తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన విజేతలు 12న భీమిలిలోని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో నిర్వహించే ఫైనల్స్ పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. మొదటి బహుమతిగా రూ.50,116, రెండవ బహుమతిగా రూ.25,116, మూడవ బహుమతిగా రూ.15,116 ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ద్వారా అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల కళాకారులు ఆయా ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు.

6న పెన్షనర్ల సమావేశం

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్‌లోని జ్యూట్ మిల్లు కళ్యాణ మండపంలో ఈ నెల 6వ తేదీ ఉదయం 9 గంటలకు పింఛనుదారుల సంఘం చిట్టివలస ఏరియా సమావేశం జరుగుతుందని సంఘం అధ్యక్షులు అల్లు బాబూరావు, సహాయ కార్యదర్శి దామోదర బాబాజీ, కార్యదర్శి ఎం.ప్రసాద్ తెలిపారు. సంఘం జిల్లా నాయకులు కె.దీనబంధు, ఎస్‌కె.హుస్సేన్ హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని పింఛనుదారులను కోరారు.

ఆర్థిక సహాయం

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 6వ వార్డు పరిధి రేవళ్లపాలెనికి చెందిన పండ రాజేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. రాజేష్‌కు తీవ్రగాయాలపాలు కావడంతో చంద్రంపాలెం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు స్పందించి అతనికి రూ.30వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంగు ఆనందరావు, శ్రీరామ్మూర్తి, మంగరాజు, చంద్రమౌళి, వాండ్రసి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంత అడ్డగింత : రోడ్డుపై వర్తకుల బైఠాయింపు



సేవా రహదారిలో బైఠాయించిన చిరు వర్తకులు

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి కార్యాలయం వద్ద ప్రతి శనివారమూ నిర్వహించే వారంతపు సంత వర్తకులను పోలీసులు మళ్లీ అడ్డుకున్నారు. దీంతో తీవ్రవేదనకు గురైన సంత నిర్వాహకులు సిఐటియు ఆధ్వర్యాన సేవా రహదారిలో బైఠాయించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సిఐ కాంతారావు వచ్చిన వర్తకులతో మాట్లాడారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా కొంత స్థలం వదిలి పెట్టి సంత నిర్వహించుకోవాలని చెప్పడంతో వర్తకులు ఆందోళన విరమించారు. ఆ సందర్భంగా సిఐటియు నాయకులు పి.రాజ్‌కుమార్, డి.కొండమ్మ మాట్లాడుతూ, మధురవాడలో సంత వల్ల నిలిచే ట్రాఫిక్ కంటే కొమ్మాది నుంచి క్రికెట్ స్టేడియం వరకు నిలిచిపోయే ట్రాఫిక్ వంద రెట్లు ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకుండా, సంత వ్యాపారులను బాధ్యులను చేయడం సరికాదన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా క్రమశిక్షణగా సంతను నిర్వహించుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు డి.అప్పలరాజు, నాయకులు జి.కిరణ్, టి.అప్పారావు, శంకరరావు, బి.రమణ, ఎస్‌కె.మస్తాన్, దుర్గా, ఎస్‌కె.పాతిమా, చిన్నారావు, అరుణ, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం ఉన్నతంగా ఉండాలి

బాసర విద్యా సంస్థల చైర్మన్ రమేష్



మాట్లాడుతున్న చైర్మన్ రమేష్

ప్రజాశక్తి -తగరపువలస : ఎంచుకున్న లక్ష్యం ఉన్నతంగా ఉండాలని స్థానిక బాసర విద్యా సంస్థల చైర్మన్ పూడి రమేష్ విద్యార్థులకు సూచించారు. స్థానిక బాసర డిగ్రీ కళాశాల విద్యార్థుల "కల్చరల్ కార్నివాల్"ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు చైర్మన్ రమేష్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సిహెచ్.సురేష్, భాస్కరరావు, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఎఒ కేశవ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం : గంటా



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : తమ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. నాలుగో వార్డు పరిధిలో జివిఎంసి నిధులు రూ.57 లక్షలతో రోడ్లు, కాల్వల నిర్మాణ పనులకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. కె.నగరపాలెంలో రూ.19.5 లక్షలు, కాపులుప్పాడలో రూ.19 లక్షలు, నిడిగట్టులో రూ.19 లక్షలతో రోడ్లు, కాల్వల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమ ప్రసన్నవాణి, జెడ్‌పిటిసి సభ్యుడు గాడు వెంకటప్పడు, టిడిపి మండల అధ్యక్షులు డిఎకె.రాజు, రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, వార్డు అధ్యక్షులు పాసి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని తర్లువాడ-బాకురుపాలెం రహదారిలో శనివారం రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. తర్లువాడ గ్రామానికి చెందిన మాజీ వార్డు మెంబర్ మజ్జి అప్పలరాజు (50) శనివారం ఉదయం 10.30 సమయంలో దేవాలయానికి బైక్‌పై వెళుతున్నాడు. లారీని తప్పించబోయి అదుపుతప్పి రోడ్డుపై పడ్డాడు. తీవ్ర గాయాలైన అప్పలరాజును చికిత్స నిమిత్తం విశాఖపట్నం అపోలో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అప్పలరాజు మృతిచెందినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో అప్పలరాజు బైకు వెనుక కూర్చున్న మహిళ బాలి అప్పలకొండ (55)కు స్వల్ప గాయాలయ్యాయి. మజ్జి అప్పలరాజుకు భార్య అచ్చియ్యమ్మ, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. సిఐ చింతా వాసునాయుడు ఆధ్వర్యాన ఎస్ఐ గంట్యాడ సంతోషం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి హత్య

ప్రజాశక్తి -ములగాడ : మల్కాపురంలో నివాసముంటున్న సారిపిల్లి వాసును దొండపర్తి ప్రాంతానికి చెందిన పవన్ సాయి హత్య చేశాడు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి మల్కాపురం పోలీసుల కథనం ప్రకారం... సరిపిల్లి వాసు కుటుంబంలో ముగ్గురు అన్నదమ్ములు ఉన్నారు. వెంకన్నపాలెంలో నివాసముంటున్న పెద్దన్నయ్య సింహాచలం ఇంటికి వెళ్లగా కొద్దిపాటి వివాదం చెలరేగింది. ఈ వివాదంలో వాసుతోపాటు సింహాచలం, గోపి వాదనలకు దిగారు. ఇంతలో సింహాచలం రెండో భార్య కుమారుడు పవన్ సాయి సడన్‌గా వాసుపై దాడి చేసి పిడి గుద్దులు కురిపించాడు. కింద పడ్డ వాసు తలను గోడకు, భూమికి పలుమార్లు గుద్దించడంతో తీవ్ర రక్తస్రావం జరిగి వాసు అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబీకులు ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. సారిపిల్లి గోపి ఫిర్యాదు మేరకు మల్కాపురం సిఐ విద్యాసాగర్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : తెగి పడి ఉన్న విద్యుత్ వైర్లు తగిలి ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన మండలంలోని పి.భీమవరం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... పి.భీమవరం గ్రామానికి చెందిన వేపాడ అప్పారావు కుమారుడు భువన్ శంకర్ (15) శనివారం బంజర్ పొలంలోకి వెళ్ళాడు. అక్కడ గెడ్డ దాటుతుండగా, అప్పటికే నేలపై తెగి పడి ఉన్న విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుత్ షాక్ గురై భువన్ శంకర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఇది గమనించిన కుటుంబీకులు హుటాహుటిన చోడవరం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భువన్ శంకర్ వడ్డాది కెపిడి జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి చదువుచున్నాడు. భువన్ శంకర్ మృతితో తల్లి దండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

బోస్ ఆర్థిక సాయం



ఆర్థికసహాయం అందిస్తున్న బోస్

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం గిడిజాల పంచాయతీ దిబ్బడిపాలెం గ్రామానికి చెందిన కుణితి రమణ కుటుంబానికి మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ తరపున ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ రూ.లక్ష చెక్కును అందజేశారు. దిబ్బడిపాలెం గ్రామానికి చెందిన రమణ (26) లారీ డ్రైవర్‌గా చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. హైబీపీ కారణంగా బ్రెయిన్ హేమరేజ్ కావడంతో గీతం హాస్పిటల్లో చేరారు. రమణ కోమాలోకి వెళ్లిపోయాడని గీతం డాక్టర్లు తెలిపారు. ఆపరేషన్ ఖర్చులు సుమారు రూ.6.50 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. నిరుపేదలు, రోజు కూలీలైన రమణ తల్లిదండ్రులు దిక్కు తోచని స్థితిలో మహాలక్ష్మి కల్చర్ అసోసియేషన్ అధినేత ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్‌ను కలిశారు. వెంటనే స్పందించిన ఆయన గీతం హాస్పిటల్ యజమాన్యం భరత్‌తో మాట్లాడారు. రూ.3 లక్షల వరకు బిల్లు తగ్గిస్తామని హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది. ఈ మేరకు రమణ తండ్రి మోహనరావుకు రూ.లక్ష చెక్కును ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ అందజేశారు. కార్యక్రమంలో గిడిజాల గ్రామ నాయకులు శినగం రామకృష్ణ, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేటి మానవహారాన్ని జయప్రదం చేయాలి


ధర్నాలో పాల్గొన్న కార్మిక సంఘాల నేతలు, కార్మికులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణ కోసం ఆదివారం ఉదయం అగనంపూడి నుంచి గాజువాక వరకు జాతీయ రహదారిపై చేపట్టే మానవహారాన్ని జయప్రదం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, అఖిల పక్ష కార్మిక సంఘాలు పిలుపు నిచ్చాయి. జాతీయ ఎన్‌జెసిఎస్ సంఘాల పిలుపు మేరకు హెచ్‌ఆర్‌ఎ ఇవ్వాలని, ఉక్కునగరంలో పెంచిన కరెంట్ ఛార్జీలు తగ్గించాలని, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించాలని అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన ఉక్కు ప్రధాన పరిపాలన భవనం, బిసి గేట్ వద్ద ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాల నుద్దేశించి కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరణ చేయడానికి పూనుకోవడం దుర్మార్గమన్నారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న కర్మాగారాన్ని ప్రయివేటీకరణ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఉక్కును సెయిల్ లో విలీనం చేస్తూ, పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు. ఉక్కు ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తూ దసరాకు బోనస్ చెల్లించాలని కోరారు. ఉక్కు కర్మాగారం సమస్యల పరిష్కారం కోసం ఆదివారం నిర్వహించే మానవహారంలో ఉక్కు కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. స్టీల్ ఎఐటియుసి అదనపు ప్రధాన కార్యదర్శి జె.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ, కెఎస్‌ఎన్.రావు, మసేన్‌రావు, మంత్రి రాజశేఖర్, ఎన్.రామచంద్రరావు, కారు రమణ, జె.అయోధ్యరామ్, రామస్వామి, వైటి.దాస్, కె.శ్రీనివాసరావు, జి.నరేంద్ర, డేవిడ్, రామ్‌కుమార్, పల్లా పెంటారావు, కె.రాజబాబు, నరేష్ కుమార్, జి.ఆనంద్, డి.శ్రీనివాస్, పి.వి.రమణమూర్తి, ఎస్.మోహన్‌బాబు, దొమ్మేటి అప్పారావు, నమ్మి సింహాద్రి, బొడ్డు పైడిరాజు, చీకటి శ్రీనివాస్, అట్టా అప్పారావు, కాంగ్రెస్ శ్రీనివాస్‌నాయుడు, మహాలక్ష్మి నాయుడు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎం.కృష్ణారావు

కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి -గాజువాక : పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9000 చెల్లించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు ఎం.కృష్ణారావు డిమాండ్‌చేశారు. పెదగంట్యాడ సిడబ్ల్యుసిలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వంలో 35 ఏళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న పెన్షనర్లకు వెయ్యి నుంచి రూ.1500 పెన్షన్ వస్తుందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి రెండేళ్లు గడుస్తున్నా అమలు చేయడం లేదన్నారు. రిటైర్డ్ అయిన ఉద్యోగి కుటుంబానికి మెడికల్ సౌకర్యం కల్పించాలని, ట్రైన్ చార్జీల్లో 50 శాతం రాయితీ ఇవ్వాలని కోరారు. జిల్లా కార్యదర్శి హుస్సేన్ మాట్లాడుతూ, ఈనెల 8న పిఎఫ్ ఆఫీస్ వద్ద చేపట్టే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.దీనబంధు, కె.పెంటారావు, బి.గురప్పు, సింహాచలం, వెంకటరావు, ఎన్‌వి.రమణ, శీసెట్టి అప్పారావు, సోమినాయుడు పాల్గొన్నారు.

పటమటీది నాటకం

కవితా సంపుటి ఆవిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార: మిరప మహేష్ రచించిన పటమటీది నాటకం కవితా సంపుటి ఆవిష్కరణ సభ విశాఖ పౌర గ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యాన నిర్వహించారు. యుపిఎస్‌సి పూర్వ సభ్యులు ఆచార్య కెఎస్.చలం ముఖ్య అతిథిగా హాజరై కవితా సంపుటిని ఆవిష్కరించారు. కొన్ని కవితలను చదివి వాటిని విశ్లేషించి మిరప మహేష్‌ను అభినందించారు. సాహితీ విశ్లేషకులు డాక్టర్ మాటూరి శ్రీనివాస్ కవిత్వాన్ని విశ్లేషిస్తూ, ప్రత్యేకతలను విశదీకరించారు. సభాధ్యక్షులు ఉప్పల అప్పలరాజు మాట్లాడుతూ, మిరప మహేష్ మంచి కవి అన్నారు. పాలక వర్గాన్ని ప్రశ్నించే తత్వం అతనికి ఉందని తెలిపారు. ఆత్మీయ అతిథులుగా డాక్టర్ డివి.సూర్యారావు, ఎన్.హనుమంతరావు, డాక్టర్ బండి సత్యనారాయణ, డాక్టర్ సిఎస్.క్షేత్రపాల్‌రెడ్డి, మోకా రత్నరాజు హాజరై మిరప మహేష్‌ను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మేడా మస్తాన్ రెడ్డి, పి.ఎ.రాజు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను చేర్చేలా బోధన

ప్రజాశక్తి -ఆనందపురం : విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చే రీతిలో విద్యాబోధన చేపట్టాలని రవీంద్రభారతి పాఠశాలల నార్త్ ఆంధ్ర జోనల్ ఇన్‌ఛార్జి ఎన్.వెంకటేష్ పేర్కొన్నారు. ఆనందపురం మండలం వెల్లంకి రవీంద్రభారతి పాఠశాలలో ఉపాధ్యాయులకు 3, 4, 5 తేదీల్లో ఏర్పాటుచేసిన శిక్షణా శిబిరం శనివారంతో ముగిసింది. ముగింపులో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు బోధించిన, బోధించాల్సిన పాఠ్యాంశాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీసే విధంగా ఉపాధ్యాయులకు శిక్షణ ఎంతో దోహదపడుతుందన్నారు. విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాల్లోని 30 శాఖల నుంచి సుమారు 700 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఆర్ఐటిలో ఇండోర్ క్రీడలు

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని సొంట్యాం నడిపల్లి సత్యనారాయణరాజు కళాశాలలో ఇండోర్ ఇంట్రా మ్యూరల్ స్పోర్ట్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 4, 5 తేదీల్లో టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, చెస్ పోటీలు నిర్వహించారు. 380 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎన్.ప్రసాదరాజు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. క్రీడల ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శంభుప్రసాద్, సిఎమ్ఓ డాక్టర్ పి.సుబ్బరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు ఢిల్లీశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎస్ఆర్ఐటి విద్యార్థికి బాక్సింగ్‌లో గోల్డ్‌మెడల్

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని సొంట్యాం నడిపల్లి సత్యనారాయణరాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీలో ప్రథమ సంవత్సరం సిఎస్ఎం చదువుతున్న జి.అజయ్ డిండిగల్ ఉత్తరాఖండ్‌లో సెప్టెంబర్ 27 నుంచి 30వ తేదీ వరకు జరిగిన నేషనల్ లెవెల్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించారు.

పోర్టు నిధులతో ఆసుపత్రిని అభివృద్ధి చేయాలి



దీక్షలో కూర్చున్న స్వతంత్రకుమార్ తదితరులు

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు నిధులతోనే సిల్వర్‌జూబ్లీ ఆసుపత్రిలో వైద్యం అందించాలని సిఐటియు అక్కయ్యపాలెం జోన్ కార్యదర్శి ఎన్.ప్రకాశరావు డిమాండ్ చేశారు. పోర్టు ఆసుపత్రిని ప్రయివేటుకు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం నాటికి 5వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలనుద్దేశించి ప్రకాశరావు మాట్లాడుతూ, పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే ప్రజల ఆగ్రహాన్ని చూడాల్సి ఉంటుందని హెచ్చరించారు. పోర్టు భూములను కాజేస్తున్నారన్నారు. ప్రజలకు చెందాల్సిన ఆస్తులు వ్యాపారులకు అప్పచెబుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జోన్ అధ్యక్షులు కుమార్, నాయకులు అప్పలరాజు, రాజు, రమణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మంత్రి లోకేష్‌ను కలిసిన సీతంరాజు సుధాకర్

లోకేష్‌ను కలిసిన సీతంరాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను ఉండవల్లిలోని వారి నివాసంలో తెలుగుదేశం పార్టీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. రాజకీయపరమైన పలు విషయాలను మంత్రికి వివరించినట్లు సుధాకర్ తెలిపారు.

ముగిసిన ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో అవంతి బిఎస్ఎన్ఎల్ ఇంక్యుబేషన్ సెంటర్, విశాఖ బిఎస్ఎన్ఎల్ సంయుక్తంగా గత నెల 25వ తేదీన ప్రారంభమైన ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం శనివారంతో ముగిసింది. బిటెక్ తృతీయ ఏడాది విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆప్టికల్ కమ్యూనికేషన్, డిజిటల్, మోడరన్, వైర్లెస్, వైర్డ్ కమ్యూనికేషన్ తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. భవిష్యత్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేందుకు ఈ తరహా శిక్షణా తరగతులు ఉపయోగపడతాయని బిఎస్ఎన్ఎల్ డిజిఎం డాక్టర్ ఎం.సత్యప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ శాఖ విభాగాధిపతి పి.శివభాస్కరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ



స్కూల్ బ్యాగులతో విద్యార్థులు, విసిసి ప్రతినిధులు, కన్సర్న్ మేనేజింగ్ ట్రస్టీ ప్రతినిధులు

ప్రజాశక్తి -పెందుర్తి: పెందుర్తి జోన్ వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ పరిధిలో ఉన్న పేద విద్యార్థులు 100 మందికి స్థానిక గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీలో కన్సర్న్ సంస్థ శనివారం స్కూల్ బ్యాగులు అందించింది. చైతన్యనగర్, బంటా కాలనీ, వీరా నగర్, అప్పలనర్సయ్య కాలనీ, నాయుడుతోట, సుజాత నగర్ నుంచి ఎంపిక చేసిన ఎల్‌కెజి నుంచి డిగ్రీ వరకు ఉన్న విద్యార్థులకు బ్యాగులు పంపిణీచేశారు. ఈ సందర్భంగా కన్సర్న్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ పికె.జోన్ మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు సంస్థ కృషిచేస్తుందన్నారు. అందులో భాగంగా బ్యాగ్‌లు, ల్యాప్‌టాలు, పాఠశాల భవనాల మరమ్మతులు వంటి కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. ముఖ్య అతిథి, పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఒక అంశాన్ని నేర్చుకోవడంలో విద్యార్థులకు పట్టుదల ఉండాలన్నారు. ఇష్టంగా చదువుకోవాలని సూచించారు. విసిసి వ్యవస్థాపకులు డాక్టర్ కె.రమాప్రభ మాట్లాడుతూ, చదువుతో పాటు ఏదో ఒక అంశంలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అలాంటప్పుడు స్వశక్తిపై నిలబడగలరని పేర్కొన్నారు. పిల్లలకు సహకారాన్ని అందించిన కన్సర్న్ సంస్థ ప్రతినిధి డాక్టర్ జోన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు కలిసి నిర్వహించాలని అందుకు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలేజీ వివిధ విభాగాల అధిపతులు విఆర్ఎల్ మూర్తి, డాక్టర్ ఎం.నాగమణి, బి.శేషసాయి, ఐద్వా నాయకులు రమణి, అప్పలనాయుడు, విసిసి కో-ఆర్డినేటర్ పి.సతీష్, వాలంటీర్లు లక్ష్మి, తనూజ, ఈశ్వరరావు, రూప, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్డ సంచుల పంపిణీ


గుడ్డ సంచులను పంపిణీ చేస్తున్న సురేష్‌యాదవ్ తదితరులు

ప్రజాశక్తి -ములగాడ : ములగాడ హౌసింగ్ బోర్డు కాలనీ రైతు బజార్ వద్ద కోరమండల్ మహిళా ఉద్యోగులు ఆధ్వర్యాన సిఎస్ఆర్ డిపార్ట్‌మెంట్ సౌజన్యంతో గుడ్డ సంచులు పంపిణీ చేశారు. పశ్చిమ నియోజకవర్గం జనసేన నాయకులు పుర్రె సురేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైతు బజార్‌కు వచ్చే ప్రతి ఒక్కరి నుంచి ప్లాస్టిక్ సంచులను తీసుకొని గుడ్డ సంచిని అందజేశారు. ప్లాస్టిక్‌ను విడనాలని, పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని ఈ సందర్భంగా పుర్రె సురేష్ యాదవ్ కోరారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ మేనేజర్ వెంకటరమణ, రాజీవ్, కోరమండల్ మహిళా ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.

వృత్తి విద్యపై అవగాహన

పెంచుకోవాలి

ప్రజాశక్తి -ఆనందపురం : విద్యార్థి దశ నుంచే వృత్తి విద్య కోర్సులపై అవగాహన పెంచుకోవాలని యుగశక్తి శిక్షణ జిసిడిఒ కలిసాం బేగం పేర్కొన్నారు. ఆనందపురం హైస్కూల్ విద్యార్థులకు శనివారం బ్యూటిషన్ కోర్స్‌పై ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. వేములవలసలో ఉన్న బ్యూటిషన్ సెంటర్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యతో పాటు వృత్తి విద్య కోర్సులపై శిక్షణ ఇచ్చి విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యూటీ అండ్ వెల్నెస్ ఉపాధ్యాయులు అమ్మాజీ,యుగశక్తి ఒకేషనల్ కో-ఆర్డినేటర్ రిషికేష్, ప్రధానోపాధ్యాయులు కె.రామకృష్ణ పట్నాయక్ పాల్గొన్నారు.

బాబు గారూ.. పండగ పూటా పస్తులేనా?

- కలెక్టరేట్ వద్ద విఒఎల భారీ ధర్నా
- 6 నెలల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విఒఎలు, మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

దసరా పండగకు కూడా పస్తులుండాల్సిందేనా? అంటూ వెలుగు విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్ (విఒఎ)లు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఆరు నెలలుగా బకాయి ఉన్న గౌరవ వేతనాలను వెంటనే విడుదల చేసి తమకు పండగ పూట పస్తులు లేకుండా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. ఆరు నెలల వేతనాల విడుదలతో పాటు మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ శనివారం అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ఏపీ వెలుగు విఒఏ (యానిమేటర్లు) ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం డిఆర్‌డిఏ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి డైజికి, డిఆర్‌ఓకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు వి.వి.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు కె.సూరిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అన్ని రకాల సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చడంతో పాటు డ్వాక్రా సభ్యులను ఆర్గనైజ్ చేస్తున్న విఒఏలకు ఇస్తున్న గౌరవ వేతనం రూ.8000 కూడా నెలలు తరబడి చెల్లించకపోతే వారు ఏం తిని బతకాలని ప్రశ్నించారు. ప్రభుత్వం మారినప్పుడల్లా రాజకీయంగా వేధింపులు, తొలగింపులకు పాల్పడుతున్నారని, వారికి ఉద్యోగ భద్రత లేకుండా చేయడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే వందలాది మందిని ఈ విధంగా తొలగింపులు చేశారని, వారందరినీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ కాలంలో ఇచ్చిన మూడు సంవత్సరాల కాలం పరిమితి సర్క్యులర్‌ను కూటమి ప్రభుత్వమైనా రద్దు చేయాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ కొంతమంది అధికారుల అలసత్వం కారణంగా విఒఏలకు ఏళ్ల తరబడి 26 నెలల జీతాలు కూడా చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం "లడ్డూ" రాజకీయాలను పక్కనపెట్టి చిరు ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాము, మాణిక్యం, పుష్ప, క్రాంతి, త్రినాధ్, సత్యం, రమణ, లావణ్య, వందలాది మంది విఒఎలు పాల్గొన్నారు.



ఝాన్సీతో పాఠశాల యాజమాన్యం ప్రతినిధులు

జాతీయ స్థాయి పోటీలకు ఝాన్సీ ఎంపిక

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట సెయింట్ జాన్స్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఝాన్సీ ఇటీవల సిబిఎస్ఇ ఆధ్వర్యంలో జరిగిన క్లస్టర్ లెవెల్ అథ్లెటిక్స్ పోటీల్లో 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు పాఠశాల డైరెక్టర్ నోబుల్ కుమార్, కరస్పాండెంట్ బత్తుల అనురాధ, ప్రిన్సిపాల్ రూపనంద్, ఉపాధ్యాయులు శనివారం ఝాన్సీని అభినందించారు. ఝాన్సీ ఈ నెల 6 నుండి 10 తేదీ వరకు వారణాసిలో జరుగు జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటుందని తెలిపారు.

పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తతతో ఉండాలని డైట్ కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్ అన్నారు. డైట్‌లో బి.టెక్ రెండవ సంవత్సరం విద్యార్థుల తల్లి తండ్రులు - ఉపాధ్యాయుల సమావేశం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రత్నాకర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా తల్లి తండ్రులు, తమ పిల్లల యెడల బాధ్యత వహించాలని, ఎప్పటికప్పుడు వారిని పర్యవేక్షిస్తూ ఉండవలసిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఇంజనీరింగ్ విభాగాల నుంచి, అకాడమిక్ టాపర్లకు 25 గ్రాముల విలువైన వెండి పతకాలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక సిబ్బంది పాల్గొని, విద్యార్థుల అకాడమిక్ ప్రోగ్రెస్ రిపోర్టులను తల్లి తండ్రులకు అందజేశారు.

యోగా ఛాంపియన్ షిప్‌లో మహిళా పోలీస్ ప్రతిభ

ప్రజాశక్తి-అనకాపల్లి : చత్తీస్‌ఘడ్ రాష్ట్రం బిలాయిలో సెప్టెంబరు 23 నుండి 27 వరకు నిర్వహించిన జాతీయ యోగ పోటీల్లో ఛాంపియన్ షిప్‌లో మహిళా కానిస్టేబుల్ ముడిల నిర్మల ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సాధించారు. ఈ మేరకు నిర్మల జిల్లా ఎస్పీ ఎం.దీపికను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు. నిర్మలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, ఇదే స్ఫూర్తిని భవిష్యత్తులో కూడా కొనసాగించి, మరిన్ని జాతీయ స్థాయి పతకాలను సాధించాలని అభిలాషించారు. 2014 బ్యాచ్ మహిళా కానిస్టేబుల్‌గా జిల్లా పోలీసు శాఖలో చేరిన ఎం.నిర్మల ప్రస్తుతం అచ్యుతాపురం పోలీస్ స్టేషన్లో పని చేస్తున్నారు. జాతీయ స్థాయిలో పతకం సాధించిన నిర్మలను పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్ భర్త గుణరాజు పాల్గొన్నారు.



కానిస్టేబుల్ నిర్మలను అభినందిస్తున్న ఎస్‌పి దీపిక



బాణాలతో దసరా ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు

దసరా పాటలతో అలరించిన విద్యార్థులు

ప్రజాశక్తి-యలమంచిలి : మండలంలోని జంపపాలెం హైస్కూల్లో సాంప్రదాయ దసరా పాటలు వెల్లివిరిశాయి. వెదురు విల్లంబులు ధరించి గిలకల్లో పూలు దట్టించి ఇంటింటికీ తిరిగి 'ఏదయా మీదయ మామీద లేదంటూ' బాణాలు వేసి పూలు జల్లుతూ గ్రామస్తుల్ని ఆకట్టుకున్నారు. శనివారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులంతా పాల్గొని పాత రోజులు గుర్తు తెచ్చారంటూ తల్లి దండ్రులు మురిసిపోయి పాఠశాల ఉపాధ్యాయుల్ని కొనియాడారు. పాఠశాల కమిటీ ఛైర్మన్ కనకారావు, హెచ్ఎం ఏవిఎస్ శాస్త్రి, బొడ్డేడ సత్యనారాయణ, నాగరాజు, కెఆర్ నాయుడు, సుధాకర్, శివ, శ్రీను సుబ్బారావు పాల్గొన్నారు.

డైట్‌లో వైభవంగా దసరా నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఎంతో భక్తి శ్రద్ధలతో అమ్మవారి తొమ్మిది విగ్రహమూర్తులను తయారు చేసి పూజించారు. విద్యార్థులు శాస్త్రీయ నృత్యంతో అలరించారు. విద్యార్థులు నవదుర్గల అవతారాలలో మహిషాసుర వధించు వృత్తాంతాన్ని చాలా అద్భుతంగా నృత్యం ద్వారా చూపించారు. ఉత్తరాదిన ప్రాచుర్యం పొందిన గార్బా నాట్యాన్ని కూడా విద్యార్థులు ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ఆకర్షణీయ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు, డి.ఎల్.సి.సి కోఆర్డినేటర్ షబీనా, డీన్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఈశ్వరరావు, అకాడమిక్ కోఆర్డినేటర్ కృష్ణ నాగ్, వివిధ ఇంజనీరింగ్ విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మహిషాసుర వధిపు సన్నివేశ నృత్యరూపకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ఎన్‌టిపిసి సింహాద్రి జనరల్ మేనేజర్ ఎస్‌కె.సిన్హా



పోటీలను ప్రారంభిస్తున్న ఎన్‌టిపిసి సింహాద్రి జనరల్ మేనేజర్ సిన్హా

ప్రజాశక్తి-అచ్యుతాపురం

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎన్‌టిపిసి సింహాద్రి గ్రూప్ జనరల్ మేనేజర్ ఎస్‌కె సిన్హా అన్నారు. మండలంలోని నునపర్తి గ్రామంలో శ్రీరామ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా ప్రాంగణంలో 9వ ఆంధ్ర రాష్ట్ర జూనియర్ అండర్-19 అంతర్ జిల్లాల బాల బాలికల ఛాంపియన్ షిప్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ముందుగా 13 జిల్లాల క్రీడాకారుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్టిపిసి పరిసర ప్రాంతమైన నునపర్తి గ్రామంలో ఇటువంటి రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం చాలా అభినందనీయమన్నారు. క్రీడా పోటీలకు ఎన్టిపిసి సింహాద్రి నుండి పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు. క్రీడా పోటీలలో క్రీడాకారుల నైపుణ్యం ప్రదర్శించి క్రమశిక్షణతో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. మాజీ ఎంపీ పప్పల చలపతిరావు మాట్లాడుతూ క్రీడలతో అంతర్జాతీయ గుర్తింపు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ జనరల్ సెక్రెటరీ వై.రాజారావు, రాష్ట్ర అధ్యక్షులు వై.విజయ శంకర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్ ఆర్‌వివి.నగేష్, ముప్పన వీర్రాజు, విశాఖ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.ప్రభుజీ, ప్రధాన కార్యదర్శి గొంప నరసింహనాయుడు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పెదపూడి శంకర్రావు, చీఫ్ రిఫరీ ఎంవిఎన్.రాజు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు విజేతలు

ఈ పోటీల్లో బాలికల విభాగంలో శ్రీకాకుళం, తూర్పుగోదావరి, విశాఖ, ప్రకాశం, గుంటూరు, కృష్ణ, కర్నూలు, చిత్తూరు జిల్లాలకు చెందిన జట్లు మొదటి రౌండ్లో విజయం సాధించాయి. బాలుర విభాగంలో ప్రకాశం, విశాఖ, తూర్పుగోదావరి, చిత్తూరు, కర్నూలు, శ్రీకాకుళం, అనంతపురం, కృష్ణ జిల్లాల జట్లు విజేతలుగా నిలిచాయి.

ఆలోచింపజేస్తున్న నాటికలు



మనస్విని నాటికలోని ఓ సన్నివేశం

ప్రజాశక్తి- అనకాపల్లి

దసరా నవరాత్రుల మహోత్సవాల సందర్భంగా శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయం ఆధ్వర్యంలో కర్రి సన్యాసినాయుడు, శివ ఆర్థిక సహకారంతో శ్రీగౌరీ సేవా సంఘం మల్ల జగన్నాథం కళ్యాణ మండపంలో కర్రి రమేష్ మెమోరియల్ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. శనివారం గుంటూరు జిల్లా తాడేపల్లి అరవింద ఆర్ట్స్ వారి "మనస్విని", గుంటూరు ఆరాధన ఆర్ట్స్ అకాడమీ వారి "క్షేత్రం" రెండు నాటికలు ప్రదర్శించారు. పొత్తూరు విజయలక్ష్మి మూల కథ నుంచి వెల్లూరి శివప్రసాద్ రచించిన మనస్విని నాటికకు గంగోత్రి సాయి దర్శకత్వం వహించారు. డబ్బే ముఖ్యం అంటున్న ఈ రోజుల్లో మానవ సంబంధాల్లోనే మానవీయ కోణాన్ని ఉన్నత సంస్కారాన్ని, ఆదర్శాన్ని ఆవిష్కరిస్తూ డబ్బు కన్నా మానవ సంబంధాలు ఎంత విలువైనవో తెలియజేప్పే ఓ మంచి నాటిక ఇది. అలాగే రెండో ప్రదర్శన ఆకురాతి శిల్ప రచించి జీవి మనోహర్ దర్శకత్వం వహించిన క్షేత్రం నాటిక కథాంశం సంక్షిప్తంగా రైతులు తమ తమ క్షేత్రాల్లో పంటలు పండించకపోతే మానవాళికి తిండి దొరకదు. అలాగే స్త్రీమూర్తులు కడుపు పండకపోతే మానవ సృష్టి జరగదు. మేధావులు, మహానుభావులు ఆ క్షేత్రం నుంచి వచ్చినవారే. అటువంటి క్షేత్రాలను కాపాడుకోవాలని, అందుకోసం ఆడపిల్లలను బతకనివ్వాలని, బతికించుకుందాం అని తెలియ చెప్పేదే క్షేత్రం నాటిక. ఈ రెండు నాటికలు ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సంఘటనలకు అద్దం పట్టాయి. ఈ నాటికలు ప్రేక్షకులను మరోసారి ఆలోచింపజేశాయి. ఇందుకుగాను నిర్వాహకులను ప్రేక్షకులు అభినందించారు.

ఉచిత ఇసుక హామీని అమలు చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన ధర్నాలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

తాము అధికారంలోకి వస్తే ఉచితంగా ఇసుక ఇస్తామని ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన మూడో రోజు శనివారం కూడా ధర్నాలు జరిగాయి. దేవరాపల్లి మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యాన భవన నిర్మాణ కార్మికులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి బిటి.దొర మాట్లాడుతూ అందరికీ ఇసుకను అందుబాటులోకి తెచ్చి, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి చూపాలని, ఇసుక అక్రమాలను అరికట్టాలని కోరారు. కూటమి ప్రభుత్వం హయాంలోనూ ఇసుక అక్రమ వ్యాపారం విచ్చలవిడిగా సాగుతోందని, ఇసుక విషయంలో గత వైసిపి ప్రభుత్వానికి, నేటి టిడిపి కూటమి ప్రభుత్వానికి తేడా లేకుండా పోయిందని పేర్కొన్నారు. అనేక చోట్ల ఇసుక లభించడం లేదన్నారు. రవాణా ఛార్జీలు, ఇతర పేర్లు చెప్పి అధిక ధరకు ఇసుక విక్రయం జరుగుతుందని, కొన్ని చోట్ల ప్రజా ప్రతినిధులు, అధికార పార్టీ నేతలు ఇసుకపై పెత్తనం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నమ్మి నాగరాజుతోపాటు అధిక సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.



యలమంచిలిలో ప్లకార్డులతో నిరసన



దేవరాపల్లిలో నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు, భవన నిర్మాణ కార్మికులు

యలమంచిలి : ఉచితంగా ఇసుక అందించి తద్వారా జిల్లాలోని 1.50 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన శనివారం భవన నిర్మాణ కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయంలో ఎలక్షన్ డిటి కె.వాలేశ్వరరావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు సిహెచ్.శివాజీ మాట్లాడుతూ ప్రస్తుతం టన్ను ఇసుక రూ.2,300 అమ్ముడవుతోందని, సిమెంట్ బస్తా ధర రూ.370 ఉంటే, ఇసుక బస్తా ధర రూ.300 పలుకుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధంగా ధరలుంటే నిర్మాణ పనులు ఎలా సాగుతాయని ప్రశ్నించారు. ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని మాటిచ్చిన కూటమి ప్రభుత్వం దానిని అమలు చేసి కార్మికులకు చేయూతనివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు కర్రి అప్పారావు, ఆర్.రాము, మేస్త్రీలు లక్ష్మణ్, గణేష్, రామకృష్ణ తదితరలు పాల్గొన్నారు.

టూరిజం హబ్‌గా గుర్తించి అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి మండలంలోని చింతలపూడి గ్రామ పరిసర ప్రాంతాలను టూరిజం హాబ్‌గా గుర్తించి అభివృద్ధి చేయాలని విశాఖపట్నం పర్యటనలో ఉన్న రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శనివారం వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన మంత్రి దుర్గేష్ చింతలపూడిని పర్యాటక కేంద్రంగా గుర్తించి ఏకో టూరిజం హాబ్‌గా చేస్తామని హామీ ఇచ్చారు. దీనిపై ఒక డ్రాఫ్ తయారు చేసి స్వయంగా వచ్చి ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా నానాజీ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, మాజీ జడ్పీటీసీ పోతల పాత్రినాయుడు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఎలమంచిలి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఎంఎస్ఎంఈ చైర్మన్ తమ్మినేని శివశంకర్, రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన శనివారం వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎలమంచిలి నియోజకవర్గంలోని పరిశ్రమలలో స్థానికులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఫార్మా పరిశ్రమలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కాలినడకన విజయవాడ బయలుదేరిన భవానీ భక్తులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి గ్రామానికి చెందిన పలువురు భవాని భక్తులు శనివారం కాలినడకన దిబ్బిడి గ్రామం నుండి విజయవాడ బయలుదేరి వెళ్లారు. శుక్రవారం మాలలు వేసుకున్న పలువురు భక్తులు శనివారం ఉదయం ఆలయంలో ప్రత్యేక ప్రజలు నిర్వహించి అనంతరం విజయవాడ బయలుదేరి వెళ్లారు.

22న ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై రైతు సదస్సు

ప్రజాశక్తి -అనకాపల్లి : ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల అభివృద్ధికి నిధుల కేటాయింపు, బాబు జగ్జీవన్ రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఆవశ్యకతపై ఈనెల 22న రైతు సదస్సు నిర్వహిస్తున్నట్టు ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో శనివారం మేక సత్యనారాయణ అధ్యక్షతన ప్రజా సంఘాలతో సమావేశం జరిగింది. ఉత్తరాంధ్రలో సుమారు 25 వేల చెరువులు, 23 లక్షల ఇరవై ఒక్క వేల ఎకరాల సారవంతమైన భూములు ఉన్నాయని తెలిపారు. కాని కేవలం ఎనిమిది లక్షల ఎకరాలకే సాగునీరు అందుతుందని, దీంతో ఉత్తరాంధ్ర వ్యవసాయపరంగా వెనుకబడిందని చెప్పారు. ఉత్తరాంధ్రలో రెండో పంటకు కేవలం ఏడు శాతం పంటలకు మాత్రమే సాగునీరు అందడం పాలకులు ఉత్తరాంధ్రపై చూపుకు నిదర్శనమన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు, ఏఐటియుసి కన్వీనర్ వైఎన్ భద్రం, ఫణీంద్ర, నరాల శెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

పశువులపై కుక్కల దాడి

- రెండు ఆవు పెయ్యలు, ఒక గేదెకు తీవ్ర గాయాలు
- బెంబేలెత్తున్న ఆర్‌వై.అగ్రహారం గ్రామస్తులు
- పట్టించుకోని పంచాయితీ అధికార యంత్రాంగం



కుక్కల దాడిలో గాయపడిన ఆవు పెయ్య

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఒకప్పుడు గ్రామాన్ని రక్షించే గ్రామ సింహాలు (వీధి కుక్కలు) ఇప్పుడు పశువుల పాలిట మృత్యు సింహాలుగా మారుతున్నాయి. ఆవులు, గేదెలు, ఆవు పెయ్యులు, గొర్రెలు, మేకలపై దాడులు చేస్తున్నాయి. మండలంలోని ఆర్‌వై అగ్రహారం గ్రామంలో శనివారం ఉదయం ఆ గ్రామానికి చెందిన బోని సత్యనారాయణమూర్తికి చెందిన రెండు ఆవు దూడలపై ఎనిమిది కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి ముక్కల ముక్కలుగా శరీరాన్ని తీసి తీవ్రంగా గాయపరిచాయి. అవి ప్రస్తుతం కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాయి. 15 రోజుల క్రితం ఒక ఆవు దూడను, ఒక గేదెను గాయపరిచాయి. ప్రస్తుతం వాటి పరిస్థితి విషమంగా ఉంది. గ్రామంలో సుమారుగా 100 నుంచి 120 వరకు వీధి కుక్కలు ఉన్నాయి. అవి వీధిలో స్వైరవిహారం చేస్తూ కనపడిన వారిపైనా, పశువులపైనా దాడి చేస్తూ ఉండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కుక్కకాటుకు గురైన జంతువులు కొనఊపిరితో ఉంటూ కొద్ది రోజులు తరువాత చనిపోతున్నాయి. దీంతో పశువుల్ని బహిరంగ ప్రదేశాల్లో ఉంచాలంటేనే రైతులు భయాందోళనకు గురవుతున్నారు. అయినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో పలు గ్రామాల్లో ఇదే పరిస్థితిగా ఉందని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఐదు సంవత్సరాల క్రితం వరకు పంచాయతీల్లో కుక్కలను నిర్మూలన చేసేవారు. ప్రస్తుతం పంచాయతీలలో కుక్కల నిర్మూలన లేకపోవడంతో వాటి సంఖ్య విపరీతంగా ఎక్కువగా పెరిగిపోయింది. మండల పీహెచ్సీ పరిధిలో కుక్కల సంతాన నిరోధక కేంద్రాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

2618 కేజీల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండలంలోని సీతయ్యపేట గ్రామంలో విజిలెన్స్, రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా శనివారం రాత్రి దాడి చేసి 2618 కేజీల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసారు. సీతయ్యపేటకు చెందిన వై.సతీష్ 2016 కేజీలు, రావికమతం మండలం గొంప గ్రామానికి చెందిన ఉడత సత్తిబాబు 602 కేజీలు ఇరువురి వద్ద 2618 కేజీలు రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొని గౌడౌన్ తరలించినట్లు సిఎస్ డిటీ కె.ఈశ్వరరావు, తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ తిరుపతిరావు, ఎస్ఐ మురళి, సిబ్బంది పాల్గొన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని సిఎస్ డిటి ఈశ్వరరావు తెలిపారు.



పట్టుబడిన రేషన్ బియ్యం

చౌడువాడ పంచాయతీ కార్యదర్శిగా సురేష్ బాబు

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ మేజర్ పంచాయతీ కార్యదర్శిగా పి.సురేష్‌బాబు శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన ఆనందపురం మండలం గొట్టిపల్లి పంచాయతీ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన నక్క రామనాయుడు చోడవరం మండలం గాంధీ గ్రామం పంచాయతీ కార్యదర్శిగా బదిలీపై వెళ్లారు.

దేవరాపల్లి : మండలంలోని ముసిడిపల్లి పంచాయతీ కార్యదర్శిగా లింగన్న శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆయన తామరబ్బ పంచాయతీ కార్యదర్శిగా పని చేశారు. ఈ మేరకు ఆయన్ను గ్రామస్తులు సాలువతో సత్కరించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సోమిరెడ్డి గోవింద, బొడ్డు చిన వెంకటరావు, రాయవరం సాంబమూర్తి, మతాల మధు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి కల్యాణ టికెట్ల అమ్మకం

ప్రజాశక్తి-అనకాపల్లి : కార్తీక మాసంలో గౌరీ పరమేశ్వరి అమ్మవారి అగ్గిమరి చెట్టు వీధిలో మీనాక్షి సుందరేశ్వర స్వామి లీలా కళ్యాణం 216 మంది దంపతులతో సామూహికంగా నిర్వహించనున్నట్లు గౌరీ పరమేశ్వరి అమ్మవారి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు కొణతాల కారుబాబు తెలిపారు. దీని నిమిత్తం శనివారం ఉదయం కళ్యాణ టికెట్లను సేవా సదన్ కోశాధికారి కొణతాల నాగేశ్వరరావు ప్రారంభించారు. టికెట్లను పేరట్ల నరసింహమూర్తి, కాండ్రేగుల తేజ బొడ్డెడ దుర్గ లక్ష్మి మొదటిగా కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ యల్లపు చంద్రమోహన్, కాండ్రేగుల సూర్యఅప్పారావు, ఆళ్ల శ్రీను, మహిళా సంఘం అధ్యక్షురాలు కాండ్రేగుల కుమారి, కార్యదర్శి కాండ్రేగుల శంకరమ్మ, హరినాథ్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించాలి

రాజకీయ పార్టీలకు డిఆర్ఒ దయానిధి విజ్ఞప్తి

ప్రజాశక్తి-అనకాపల్లి


స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పలనకు రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని జిల్లా రెవిన్యూ అధికారి బి.దయానిధి పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ 2025 సంబంధించి ఇంటింటికి ఓటరు జాబితా తనిఖీ 99.89 శాతం పూర్తిచేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 12,90,276 ఓటర్లు ఉన్నారని వారిలో 12,88,801 ఓటర్లను ధ్రువీకరించడం జరిగిందని చెప్పారు. అక్టోబరు 29వ తేదీన డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రకటిస్తారని, అభ్యంతరాలుంటే తెలియజేయాలని కోరారు. జిల్లాలో 1529 పోలింగు కేంద్రాలు ఉన్నాయని, మాడుగుల నియోజకవర్గం నుండి నాలుగు, నర్సీపట్నం నియోజకవర్గం నుండి ఏడు పోలింగు కేంద్రాల లొకేషను మార్పునకు ప్రతిపాదనలు వచ్చాయని, 11 పోలింగు స్టేషన్ల లొకేషన్ల మార్పుకొరకు ఎన్నికల కమిషనుకు ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు తెలిపారు. 2025 జనవరి 1వ తేదీన నాటికి 18 ఏళ్ళు నిండిన వారు ఓటు హక్కు కోసం ఈనెల 29 నుండి నవంబర్ 28 వరకు దరఖాస్తులను నమోదుతో పాటు అభ్యంతరాలు, దిద్దుబాట్ల కోసం దాఖలు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ఏజెంట్లు ప్రత్యేక ప్రచార కార్యక్రమం సమయంలో ప్రజలకు అవగాహన కల్పించి, ఓటరు జాబితా పరిశీలించుకొనే విధంగా ప్రోత్సహించాలని కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ ప్రస్తుతం 1500 ఓటర్లకు ఒక పోలింగు కేంద్రం ఉందని, దీని వల్ల కొన్ని చోట్ల రాత్రి 12 గంటల తరువాత కూడా ఓటింగు జరుగుతుందని, చాలా సమస్యలు వస్తున్నాయని, కావున పోలింగు కేంద్రానికి 1000 నుండి 1200 ఓటర్లు ఉండే విధంగా మార్పులకు ప్రతిపాదనలు పంపించాలని కోరారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎస్-ఎస్‌వి.నాయుడు, టిడిపి ప్రతినిధి మళ్ల గణేష్, సిపిఎం ప్రతినిధి గంటా శ్రీరామ్, బిజెపి ప్రతినిధి పి.నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మీసాల సుబ్బన్న, వైఎస్ఆర్సిపి ప్రతినిధి ఎం.జానకిరామరాజు, ఆప్ పార్టీ ప్రతినిధి కె.హరినాధబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ దయానిధి

ఇసుకను ఉచితంగా అందించాలి

-మాజీ ఎమ్మెల్యే గణేష్- ఆర్‌డిఒకు వినతి



శాంతి ర్యాలీ బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్, నాయకులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:గబ్బాడ స్టాక్ పాయింట్లో ఉన్న ఇసుకను ప్రజలకు తక్షణమే ఉచితంగా అందించాలని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కోరారు. శనివారం నర్సీపట్నం ఆర్డీవో వివి.రమణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ, గబ్బాడ ఇసుక పాయింట్లో వేల టన్నుల ఇసుక నిల్వ ఉన్నప్పటికీ భవన నిర్మాణదారులకు సరఫరా చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీలో సుమారు 5వేల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారన్నారు. టిడిపి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఇసుకను ఉచితంగా అందిస్తామని చెప్పారని, తక్షణమే అమలు చేయాలని తెలిపారు. 15 రోజుల్లో ఇసుకను అందించకపోతే ఈ నెల 21న నర్సీపట్నంలో శాంతియుత నిరసన ర్యాలీ చేపడతామని చెప్పారు. అంతకు ముందు క్యాంపు కార్యాలయంలో నిరసన ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు రుత్తల యర్రాపాత్రుడు, గొలుగొండ జెడ్పీటీసీ గిరిబాబు, మాకవరపాలెం మాజీ ఎంపిపి రుత్తల సత్యనారాయణ, తమరాన శ్రీనివాస్, పెట్ల నాయుడు, చింతకాయల వరుణ్, లెక్కల సత్యనారాయణ, మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డిఎఫ్ఒగా శామ్యూల్



ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: డివిజనల్ డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (డిఎఫ్ఒ)గా ఎం.శామ్యూల్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అడవుల సంరక్షణ, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. నర్సీపట్నం ఫారెస్ట్ డివిజన్ ప్రాంతంలో అడవులను కాపాడేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. విధుల్లో చేరిన డిఎఫ్ఒను సబ్ డిఎఫ్ఒ రేంజ్ అధికారులు, డివిజనల్ సిబ్బంది కలిసి పుష్పగుచ్చాలు ఇచ్చి అభినందనలు తెలిపారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిపిఓ శిరీషా రాణి

చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీగా డిఎల్ పురం ఎంపిక

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని డిఎల్ పురం చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీగా ఎంపికైంది. ఈ మేరకు శనివారం డిపిఓ శిరీషారాణి గ్రామంలో పర్యటించారు. పంచాయతీ కార్యాలయం, అంగన్వాడి సెంటర్ సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడారు. బాల్య వివాహాలు అరికట్టడం, చైల్డ్ లేబర్ నిర్మూలించడం, అంగన్వాడీ కేంద్రం ద్వారా పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు పోషకాహారం అందించడం, వాటిపై అవగాహన కల్పించడం, క్రీడలను ప్రోత్సహించడంతో ఫ్రెండ్లీ పంచాయతీగా ఎంపికైందన్నారు. ఈ మేరకు గ్రామానికి సోమవారం నేషనల్ టీం రానుంది. ఈ నేపథ్యంలో డిపిఓ శిరీషా రాణి గ్రామంలో పర్యటించి, అధికారులను అప్రమత్తం చేశారు. పలు సూచనలు,సలహాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి.సీతారామరాజు, పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలను తొలగిస్తున్న అధికారులు, సిబ్బంది

అప్పలపాయకరావుపేటలో శ్రమదానం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని అప్పల పాయకరావుపేటలో శనివారం ఎంపీడీవో డి సీతారామరాజు ఆధ్వర్యంలో శ్రమదానం చేపట్టారు. గ్రామస్తులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో కలిసి పాఠశాల ఆవరణం, వాటర్ ట్యాంక్ పరిసర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలను, చెత్తను తొలగించారు. ప్రతి శనివారం ఒక గ్రామంలో శ్రమదానం కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్, శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్

-డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే



సత్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-మాడుగుల:స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ సివిఎస్ఎస్ శాస్త్రి అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ ఈ విద్యా సంవత్సరం కళాశాలలో ప్రవేశించిన 140 మంది విద్యార్థులకు స్వాగతం పలికారు. తహసీల్దార్ రమాదేవి మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఏర్పరచుకొని కృషి చేస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అధ్యాపకులను నాయకులు సత్కరించారు. కళాశాల సీపీడీసీ చైర్మన్ శ్రీనాధు శ్రీనివాసరావు, సిపిడిసి సెక్రటరీ దంగేటి సూర్యారావు, బీసీ హాస్టల్ వార్డెన్ దేవి,ఎస్సి హాస్టల్ వార్డెన్ కె.శైలజ, వైస్ ప్రిన్సిపాల్ జయలక్ష్మి పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఎన్.గదబ పాలెం సీపీఎం మహాసభలో కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు మాట్లాడుతూ, దేశం గర్వించదగ నాయకుడు సీతారాం ఏచూరి అన్నారు. ప్రజలు, కార్మికులు, కర్షకులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై సిపిఎం పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.రాము తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవములు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం చుట్టుప్రక్కల గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి,భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులను రాజాధిరాజ వాహనం వేయింపజేసి తిరువీధి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు భక్తులు పాల్గొన్నారు.



సత్కరిస్తున్న నాయకులు

ఆర్‌డిఒకు అభినందనలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ఇటీవల ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన వివి రమణను పట్టణ, మండల జనసేన నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికులు ఇసుక లేక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు ఊడి చక్రవర్తి, కార్యదర్శి పంచాడ హరినాథ్, సంయుక్త కార్యదర్శి అల్లాడ సురేష్, నర్సీపట్నం మండల అధ్యక్షుడు రమణ, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు మోపాడ సత్యప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామసభను బహిష్కరించిన కూటమి నేతలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని లింగంపేట గ్రామంలో శనివారం నిర్వహించిన గ్రామసభను కూటమి నాయకులు బహిష్కరించారు. గ్రామసభ నిమిత్తం గ్రామంలో ఏ చాటింపు వేయించలేదని, వైసిపి సర్పంచ్ ఒంటెద్ది పోతలతో గ్రామ సమస్యలు ఏమి పరిష్కారం కాలేదని, గ్రామసభలో ఎంపిటిసి భర్తను కూర్చోబెట్టి కూటమి నాయకులను ఎవరిని పిలవకుండా కనీసం సంప్రదించకుండా ఇష్టానుసారంగా గ్రామసభ నడుపుతున్నారని కూటమి నేతలు తెలిపారు. సచివాలయాన్ని వైసిపి కార్యాలయంగా మార్చేశారని, దీనిపై అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కూటమి నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో లింగంపేట మాజీ సర్పంచ్ పరవాడ అప్పలనాయుడు, జనసేన మండల ప్రధాన కార్యదర్శి సలాదుల ప్రసాద్ బాబు, ఉప సర్పంచ్ లంక సత్యనారాయణ, మరిసా స్వామినాయుడు, మద్దవు కామునాయుడు, అగ్రహారపు శ్రీను, నెల్లూరు బాబ్జి, కూటమి నాయకులు, గ్రామ యువత బహిష్కరించినవారిలో ఉన్నారు.

జైభీమ్ రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షునిగా నాగేశ్వరరావు



ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: జైభీమ్ రావ్ భారత్ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులుగా నర్సీపట్నంకు చెందిన నేతల నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జెడ శ్రావణ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నేతల నాగేశ్వరరావు మాట్లాడుతూ, తనపై నమ్మకంతో తనకు ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తానని వెల్లడించారు.

శ్మశాన వాటిక స్థలంలో ఇళ్ల నిర్మాణంపై ఫిర్యాదు



తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చినతీనార్ల శ్మశాన వాటిక స్థలంలో అక్రమంగా జగనన్న కాలనీ ఇల్లులు నిర్మించుకున్నారని మత్స్యకార జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు కంబాల అమ్మోరయ్య, గరికిన నూకరాజు తదితరులు శనివారం తహసిల్దార్ నరసింహమూర్తికి ఫిర్యాదు చేశారు. గ్రామంలో సర్వేనెంబర్ 145 లో 8.90 భూమి పూర్వం నుండి శ్మశాన వాటికకు ఉపయోగిస్తున్నామని, గత ప్రభుత్వ హయాంలో ఆ స్థలాన్ని జగనన్న కాలనీకి కేటాయిస్తే, తామంతా కోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. తదుపరి కోర్టు ఆదేశాల మేరకు ఈ స్థలంలో 3.50 సెంట్లు భూమిని జగనన్న కాలనీకు, మిగిలిన స్థలం శ్మశాన వాటిక కు కేటాయించడం జరిగిందన్నారు. సర్పంచ్, ఒక అధికారి నిబంధనలను పక్కనపెట్టి 5 ఎకరాలను జగనన్న కాలనీ కేటాయించి ఇష్టానుసారంగా పట్టాలు ఇవ్వడంతో ఇల్లులు నిర్మించుకున్నారన్నారు. జగనన్న కాలనీ కేటాయించిన స్థలాన్ని సర్వే చేయించి, ఆక్రమించిన స్థలాన్ని గుర్తించి శ్మశాన వాటికకు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కందాల నాగరాజు, తాతీలు, పిక్కి మహేష్, ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

శారదా పీఠాధిపతికి కేటాయించిన భూమిని వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతికి గత ప్రభుత్వం కేటాయించిన భూమిని కూటమి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ విజ్ఞప్తి చేస్తున్నారు.ఈ విషయమై శనివారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు ఆయన నివాసంలో రామ్ వినతిపత్రం అందజేశారు.

హ్యుమానిటేరియన్ అసిస్టెన్స్ ట్రస్టుకు సోషల్ ఇంపాక్ట్ అవార్డు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రతిష్టాత్మక బ్రిడ్జ్‌స్టోన్ ఇండియా మొబిలిటీ సోషల్ ఇంపాక్ట్ అవార్డును విశాఖపట్నానికి చెందిన సెంటర్ ఫర్ హ్యుమానిటేరియన్ అసిస్టెన్స్ గెలుచుకుంది. ఇది ఒక సామాజిక సేవా సంస్థ. 2024 సంవత్సరానికి ఈ అవార్డు లభించినట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు.

సిపిఎం విశాఖ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

-పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కార్యదర్శి జగ్గునాయుడు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జగ్గునాయుడు, తదితరులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : డిసెంబరు 28, 29 తేదీల్లో పెందుర్తిలో జరిగే సిపిఎం విశాఖ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని, మహాసభలు, ప్రజా పోరాటాల నిర్వహణకు ఆర్థికంగా, హార్థికంగా ప్రజలు సహకరించాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు విజ్ఞప్తి చేశారు. శనివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.జగన్, పార్టీ పెందుర్తి, గోపాలపట్నం జోన్ కార్యదర్శులు బి.రమణి, బి.వెంకటరావులతో కలసి ప్రెస్‌మీట్ నిర్వహించి మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ బిజెపి పట్టణ సంస్కరణలను తూచ తప్పకుండా అమలు చేసి గత వైసిపి ప్రభుత్వం పట్టణ ప్రజలపై చెత్త పన్ను, విలువ ఆధారిత ఆస్తిపన్నుల భారం మోపిందన్నారు. చెత్తపన్ను చట్ట విరుద్ధమని, దీనిని రద్దు చేయాలని, విలువ ఆధారిత ఆస్తి పన్నునూ రద్దు చేయాలని సిపిఎం అనేక ప్రజా ఆందోళనలు చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే సిపిఎం కార్పొరేటర్ జివిఎంసిలో ప్రభుత్వాన్ని నిలదీశారన్నారు. చెత్త పన్ను చెల్లించవద్దని ప్రజలకు పార్టీ పిలుపునివ్వగా వేలాది మంది ప్రజలు స్పందించి చెత్తపన్ను కట్టలేదన్నారు. ఫలితంగా నూతన టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం చెత్తపన్నును రద్దు చేసిందని తెలిపారు. పోరాడి విజయం సాధించిన ప్రజలకు, రద్దు చేసిన ముఖ్యమంత్రికి అభినందనలు తెలిపారు. చెత్తపన్ను వలె విలువ ఆధారిత ఆస్తి పన్ను కూడా రద్దు చేసి ఎన్నికల హామీని నిలబెట్టాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం అభివృద్ధి కోసం, స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ రక్షణ కోసం సిపిఎం అనేక ఉద్యమాలు చేస్తోందని తెలిపారు. ముడసర్లోవ పార్క్, పూర్ణామార్కెట్, ఎంవిపిలో రూ.25 కోట్లతో నిర్మించిన ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనా ప్రైవేటీకరణ, జివిఎంసి అక్రమాలు, అవినీతి చర్యలపై పోరాడుతోందన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్తు ఛార్జీలు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలపై ఆందోళనలు చేస్తోందని పేర్కొన్నారు. ఇళ్ల పట్టాలు, ఇళ్ల స్థలాలు, స్కీం ఇళ్లు, కొండవాలు ప్రాంతాలు, స్లమ్స్, మధ్యతరగతి కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పాటుపడుతోందని తెలిపారు. పంచ గ్రామాలు, గాజువాక ఇనాం భూములు, బలవంతపు ల్యాండ్‌పూలింగ్, 22ఎ, దసపల్లా భూములు వంటి జిల్లాలోని భూసమస్యలపై ఆందోళన చేస్తోందని అన్నారు. రుషికొండ, కుసులవాడ కొండలు, ఎర్రమట్టి దిబ్బల ధ్వంసాన్ని ఎదురించి పర్యావరణం, ప్రజల రక్షణ కోసం పాటుపడుతోందని తెలిపారు. ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర విభజన హామీల అమలుకు పోరాడుతోందని తెలిపారు. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు అండగా ఉంటోందన్నారు. ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని ముందుకు వెళ్తున్నట్టు తెలిపారు. ఈ క్రమంలోనే ప్రజలపై సిపిఎంకు ఉన్న విశ్వాసంతో మరిన్ని ప్రజా పోరాటాలకు, పార్టీ 24వ మహాసభల నిర్వహణకు సన్నద్ధమౌతోందని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రజలు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

సీతమ్మధార :

సిపిఎం 24వ జిల్లా మహాసభల పోస్టర్‌ను పార్టీ అక్కయ్యపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యాన శనివారం ఎస్ఆర్ నగర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు స్వతంత్రకుమార్ మాట్లాడుతూ, కమ్యూనిస్టు పార్టీ పేద ప్రజల కోసం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ కార్యదర్శి రాజు, నాయకులు అప్పలరాజు, కుమార్, ప్రకాష్, లక్ష్మీపతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ సీతారామరాజు

8,9 తేదీల్లో జాతీయస్థాయి బృందం పర్యటన

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని 3 పంచాయతీ గ్రామాల్లో ఈ నెల 8, 9వ తేదీల్లో జాతీయస్థాయి పర్యవేక్షణ టీమ్ పర్యటిస్తారని, ఇందుకు అధికారులు సన్నద్ధంగా ఉండాలని ఎంపీడీవో డి.సీతారామరాజు అన్నారు. 8న న్యాయంపూడి, 9న రమణయ్యపేట, డిఎల్ పురం పంచాయతీ గ్రామాలను జాతీయ స్థాయి పర్యవేక్షణ టీం సభ్యులు సందర్శిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేసిన నిధులతో చేసిన అభివృద్ధి పనులను, ఉపాధి పనులు, వెలుగు, అగ్రికల్చరల్, ఐ సి డి ఎస్, మైక్రో ఇరిగేషన్, హౌసింగ్ తదితర వాటిని పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.



రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

చినుకు రాలితే చిత్తడే..

ప్రజాశక్తి -కోటవురట్ల: చినుకు రాలితే మండల కేంద్రంలోని పలు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. దీంతో, ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ ఆవరణ, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఎదురుగా ప్రధాన రహదారి పై చెరువులు తలపిస్తూ నీరు నిలిచిపోయింది. శనివారం చిన్నపాటి వర్షానికి రోడ్డుపై నీరు చేరడంతో విద్యార్థులు, పాదచారులు, ద్విచక్ర వాహనదారులు అవస్థలు పడ్డారు. మండల కేంద్రంలో దాదాపు రెండు సంవత్సరాలుగా వర్షపు నీరు నిలిచిపోతూ ఇక్కట్లు పడుతున్నా పట్టించుకునేవారే లేరు. కూటమి ప్రభుత్వమైనా సమస్యను పరిష్కరిస్తుందని ఆశించిన గ్రామస్తులకు నిరాశ ఎదురవుతుంది. అధికారులు ఇప్పటికైనా చొరవ తీసుకుని సమస్యను పరిష్కరిం చాలని స్థానికులు కోరుతున్నారు.

కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్


ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక పట్టణంలో శనివారం మున్సిపల్ కమిషనర్ జంప సురేంద్ర ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేశారు. గరవవీది, కాపు వీధి, కొత్త వీధి, ఇందిరా మార్కెట్ ఏరియాల్లో కుక్కలకు వ్యాక్సిన్ వేశారు. ప్రతి ఒక్కరు పెంపుడు జంతువులకు రాబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జర్నలిస్టుల దసరా సంబరాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ఎపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఎపి బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్, ఎపి స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో ఈనెల 6న ఆదివారం విజయదశమి (దసరా) సంబరాలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్టు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, నగర అధ్యక్షుడు పి.నారాయణ తెలిపారు. శనివారం డాబాగార్డెన్స్ లోని ఒక హెటల్‌లో మూడు యూనియన్ల కార్యవర్గాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దసరా సంబరాలు ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం ఇందుకు సంబంధించిన వివరాలను వారు వెల్లడించారు. ఆదివారం ఉదయం అల్పహారంతో దసరా సంబరాలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం నగరానికి చెందిన వివిధ సంస్థల కళాకారులతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ఈ సమావేశంలో బ్రాడ్‌కాస్ట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇరోతి ఈశ్వరరరావు, మధన్, ఫెడరేషన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎ.సాంబశివరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.రవికుమార్, పితాని ప్రసాద్ పాల్గొన్నారు.

సామాజిక, సంక్షేమ రంగాలకు ప్రాధాన్యత

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్


ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా రూపొందించనున్న స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్ పై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విస్తత స్థాయి సమావేశం జరిగింది. జిల్లాలోని వివిధ విభాగాల ఉన్నతాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, రైతు సంఘాల సభ్యులు పలు అంశాలపై ఆచరణాత్మకమైన సలహాలు, సూచనలు అందజేశారు. 2047 నాటికి అభివృద్ధి చెందాలంటే సమ్మిళిత ఆర్థిక విధానాలకు పెద్దపీట వేయాలని, కొత్త ఆవిష్కరణలను స్వాగతించాలని, సాంకేతికతను మరింత పెంపొందించుకోవాలని అభిప్రాయపడ్డారు. రాబోయే ఐదేళ్లలో విశాఖపట్టణం రూపురేఖలు మారేలా వినూత్న ప్రాజెక్టులు చేపట్టాలని, విద్య,యువత ఉపాధికి కొత్త అవకాశాలను సృష్టించాలని, వ్యవసాయ రంగంలో ఆధునిక విధానాలను అవలంభించి ఉత్తమ ఫలితాలు సాధించాలని పేర్కొన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ ఉండాలని, ఆధునిక విధానాలు అనుసరించాలని సభ్యులంతా సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ, వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా విజన్ ప్రణాళికలను రూపొందించాల్సి ఉందని, ప్రాథమిక, ద్వితీయ, తృతీయ రంగాలకు సమప్రాధాన్యం కల్పిస్తూ కొత్త ఆవిష్కరణలకు చోటు కల్పించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. సామాజిక, సంక్షేమ రంగాలకు ప్రాధాన్యత కల్పిస్తూ ముందుకెళ్లాల్సి ఉందన్నారు. ఉద్యోగ, వ్యాపార అవకాశాలను పెంపొందించేలా శిక్షణలు అందించాలని, వాతావరణ పరిస్థితులతో పంటల ప్రణాళికను రూపొందించాలని సూచించారు. పిపిపి విధానంలో ప్రాజెక్టులు చేపడితే భవిష్యత్తు లక్ష్యాలను త్వరతిగతిన చేరుకోగలమన్నారు. ఎం.ఎస్.ఎం.ఈ.హబ్స్, టెక్నాలజీ సర్వీస్ హబ్‌లను అందుబాటులోకి తీసుకు రావాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. వ్యవసాయ రంగంలో నూతన విధానాలను అవలంభించాలని, అధిక దిగుబడి ఇచ్చే విత్తనాలను వినియోగించాలని సూచించారు. మార్కెటింగ్ సదుపాయాలను విస్తతం చేయాలని అభిప్రాయపడ్డారు. సేంద్రీయ ఆహార పంటలను ప్రోత్సహించడంతో మానవుల ఆరోగ్యం కాపాడుకోగలమని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర జిఎస్డీపిలో జిల్లా వాటా 9.15 శాతం ఉందని అది 15 శాతానికి పెరిగేలా అందరూ సమష్టి కృషి చేయాలన్నారు. జిల్లాలోని భూమి వినియోగాన్ని పెంచాలని, విద్యా, వైద్య రంగంలో నాణ్యత పెరగాలన్నారు. యువతలో నైపుణ్యం పెంచి కొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్, విఎంఆర్డీఎ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్, సిపివో శ్రీనివాసరావు, క్రెడాయ్, ఫిక్కీ, ఆర్.ఐ.ఎన్.ఎల్., వి-సెజ్, బెల్ తదితర సంస్థల ప్రతినిధులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గోల్ఫ్ క్లబ్‌కు మూడున్నర కోట్లు విడుదల

- మంత్రి కందుల దుర్గేష్

-వైజాగ్ ఓపెన్ టోర్నమెంటు విజేతలకు బహుమతుల ప్రధానం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైజాగ్ ఓపెన్ గోల్ఫ్ టోర్నమెంట్‌కు ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడలు, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కందుల దుర్గేష్ హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతిగా విన్నర్ అంగజ్ చీమకు 15 లక్షలు, రన్నర్ అప్ అమన్ రాజ్ కు పది లక్షల చెక్కులను అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ, విశాఖపట్నం ప్రకృతి అందాలతో పాటు, ఇక్కడ సువిసాలమైన 15 ఎకరాలలో క్రీడా మైదానం ఏర్పాటు చేసిన నిర్వాహకులను మొదటిగా అభినందించారు. అనంతరం టోర్నమెంటులో గెలుపొందిన విజేతలకు షీల్డ్‌లను అందజేశారు. విశాఖపట్నం నుండి గోల్ఫ్ క్లబ్ రాష్ట్రంలోనే అతిపెద్ద గోల్ఫ్ క్లబ్ అభివర్ణిస్తూ, దేశంలోనే ఉన్న గోల్ఫ్ క్లబ్బుల్లో 5వ అతిపెద్ద గోల్ఫ్ క్లబ్ అన్నారు. ఈ గోల్ఫ్ క్లబ్ కు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మూడున్నర కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. ఇంకా అన్ని విధాలా క్లబ్ అభివృద్ధికి సహాయ పడతామన్నారు. ఈ టోర్నమెంటుకు స్పాన్సర్షిప్ చేసిన ప్రతి ఒక్కరిని అభినందించారు. ఇదే తరహాలో అమరావతిలో కూడా గోల్ఫ్ క్లబ్ ఏర్పాటు చేయడానికి నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో గోల్డ్ క్లబ్ చైర్మన్ ఎం ఎస్ ఎన్ రాజు, కార్యదర్శి, గోల్ఫ్ క్లబ్ సభ్యులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.



శివప్రసాద్‌రాజును సన్మానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

నగర అభివృద్ధికి పాటుపడదాం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అందరం కలిసి విశాఖ నగర అభివృద్ధికి పాటుపడదామని జివిఎంసి చీఫ్ ఇంజినీర్ శివప్రసాద్ రాజు అన్నారు. శుక్రవారం జివిఎంసి చీఫ్ ఇంజినీర్‌గా బాధ్యతలు చేపట్టిన శివప్రసాదరాజును శనివారం ఉదయం జివిఎంసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గొంప చంద్రమౌళి ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరం కలిసి అభివృద్ధిలో భాగస్వాములవుదామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కన్వీనర్ రాజన వెంకటరావు, కార్యదర్శి రంది సాధురావు, ఉపాధ్యక్షులు పిఎస్.ప్రసాద్, పిఎ.రాజు, సలహాదారులు పైలా కృష్ణారావు, ప్రసాద్, ఆర్ఎ.నాయుడు, అల్లు గోవిందరావు, సత్యనారాయణ, గణేష్, పెద్దఎత్తున కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.